www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 సెప్టెంబర్ 2024

ఒపిఎస్‌ను అమలు చేయాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి – కొవ్వూరు రూరల్

ఓల్ పెన్షన్ స్కీమ్(ఒపిఎస్)ను అమలు చేయాలంటూ ఎంఎల్ఎ ముప్పిడి వెకంటేశ్వరరావుకు సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అదంఇంచారు. ఈ సందర్బంగా జోడాల మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ అమలుకు రోడ్ మ్యాప్ రూపొందించాలని, జరగబోయే శాసనసభా సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి మూడు లక్షలకు పైబడిన ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు. ఏకీకృత పింఛను విధానాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విశ్వేశ్వరరావు, ప్రసన్న కుమార్, ప్రకాష్, రామకృష్ణ, బాబూరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువు బరువు

ఎరువుల అమ్మకాలకు లింకులు
అన్నదాతలపై అదనపు భారం
ఆందోళనలో జిల్లా రైతాంగం

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

సాధారణంగా మార్కెట్లో ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటూ ప్రచారం చేస్తుంటారు. తమ సరుకు అమ్ముకోవడానికి వ్యాపారులు ఈ వ్యూహాన్ని అమలు చేస్తుంటారు. అయితే ఎరువుల వ్యాపారులు ఒకడుగు ముందుకు వేసి ఒక ఎరువు కొంటే ఇంకొకటి తప్పనిసరిగా కావాలనే నిబంధన విధిస్తున్నారు. అవసరం లేకున్నా వాటిని తీసుకోవడం రైతులకు అదనపు భారంగా మారింది.

జిల్లాలో కొవ్వూరు డివిజన్‌లో నిడదవోలు, కొవ్వూరు, నల్లజర్ల, పెరవలి, ఉండ్రాజవరం, రాజమండ్రి డివిజన్‌లో రాజమండ్రి, రాజానగరం,కడియం తదితర మండలాల్లో అత్యధికంగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 277 కేంద్రాలలో ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. వీటిలో లైసెన్సు పొందిన వ్యాపారులు 170 మంది కాగా మిగిలిన 107 కేంద్రాల్లో సొసైటీల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. అదనంగా మరో 3 హోల్‌సేల్ కేంద్రాలు ఉన్నాయి. హోల్ సెల్ డీలర్లకు ఆఫీసులు మాత్రమే ఉంటాయి. హోల్‌సేల్ వ్యాపారులకు కేటాయిస్తున్న ఎరువులు జిల్లా పరిధిలోనే రిటైల్ డీలర్లకు వెళ్తున్నాయా అనే దానిపై పర్యవేక్షణ కొరవడింది. దీనికి అవకాశంగా తీసుకుని ఇతర జిల్లాలకు ఎగుమతులు చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

జిల్లాకు ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకూ 58,000 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. అయితే 45వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు రసాయన ఎరువుల కొనుగోలుకు ఇతర ఉత్పత్తులు లింక్ పెడుతున్నారు. డిఎపి, యూరియా కాంప్లెక్స్ ఎరువులు కొనాలని వెళితే అవసరం లేని వాటిని లింక్ పెట్టి విక్రయిస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీకి చెందిన ఎరువులు కావాలంటే మరొక కంపెనీకి

చెందిన 15-15-15, 10-26-26, 22-00-11, 14-35-14, అదే విధంగా 17-17-17,20-20-00-13, 20-20-00, 19-19-19 వంటివి కొనాలని చెబుతున్నారు. డిఎపి 50 కిలోల బస్తా రూ.1350 కాగా లింక్ ఎరువులు వద్దంటే అదే బస్తా రూ.1,400 నుంచి రూ.1450 వరకూ విక్రయిస్తున్నారు. కొంతమంది డీలర్లు బయోలు లింక్ పెడుతున్నారు. మరికొందరు లిక్విడ్ మందులు రైతులకు అంటగడుతున్నారు. మొత్తంగా ఇతర ఉత్పత్తులు తీసుకుంటేనే ఎరువులు ఇస్తామనే షరతు విధిస్తున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలు జరిగాయి. అక్కడి ఉద్యోగులు ప్రభుత్వ సిబ్బంది కావటంతో ఎటువంటి లింక్‌లు లేకుండా ఎరువులు లభించేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల విక్రయాలు నిలిచిపోయాయి. ఈ కేంద్రాల్లో ఎరువులు లభించకపోవటంతో రైతులు ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఒకటి కావాలంటే మరొకటి తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ షరతులు విధించటంతో రైతులకు అయోమయ పరిస్థితి నెలకొంటుంది.

ఎరువుల విక్రయాలకు లింకులు పెడితే చర్యలు

రైతులు కోరిన విధంగా డీలర్లు ఎరువులు విక్రయాలు చేయాలి. జిల్లాలో ప్రస్తుతం 18,000 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రసాయన ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వాతావరణ పరిస్థితుల రీత్యా సాగుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. దీంతో ఎరువుల వినియోగం తగ్గింది. డీలర్లు లింక్‌లు పెట్టినట్లయితే రైతులు మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలి. డీలరుపై చర్యలు తీసుకోవటంతో పాటు అక్కడ ఉన్న ఎరువులు సజావుగా రైతులకు అందేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తాము.

- ఎస్.మాధవరావు,
జిల్లా వ్యవసాయ అధికారి, తూర్పుగోదావరి జిల్లా

37వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. స్థానిక 37, 36, 39 డివిజన్లలో ఆయా డివిజన్ల ఇన్‌ఛార్జ్‌లు ఉర్లంకల లోకేష్, తంగెళ్ల బాజీ, యాళ్ల ప్రదీప్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులతో కలిసి ఆయా డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఒక పక్క వర్షం కురుస్తున్నా ప్రజల ఇబ్బందులను దూరం చేయాలన్న సంకల్పంతో ఆయా డివిజన్లలోని లలితానగర్, ఆదెమ్మ దిబ్బ, కృష్ణానగర్, లింగంపేట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాభివృద్ధే ధ్యేయంగా తాము పని చేస్తున్నామన్నారు. అధికారంలోకొచ్చిన మొదటి రోజు నుంచే నగర అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. గత ప్రభుత్వంలో ఒక ప్రజా ప్రతినిధి చేపట్టిన అనాలోచిత పనులు కారణంగా ప్రస్తుతం నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ పనులన్నింటినీ సరి చేస్తున్నామన్నారు. కాగా ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, తప్పని సరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ప్రజలకు కావాల్సిన అన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సమస్యలు దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

భారీ వర్షాలు కారణంగా విజయవాడలో ఏర్పడిన వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం–మైత్రేయ బుద్ధ విహార్ నుంచి ఆహార పదార్థాలు పంపుతున్నట్లు పీఠాధిపతి బంతేజీ అనాలియో తెలిపారు. 2000 మంచినీరు బాటిల్స్, పులిహోర పొట్లాలు, పాలతో కూడిన వాహనాన్ని ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్‌నగర్, రాజరాజేశ్వరి పేట, నందమూరి నగర్, ఆంధ్రప్రభ కాలనీ, అంబాపురం, ఎల్‌బిఎస్ నగర్, సుందరయ్య నగర్, రాజీవ్ నగర్, ప్రకాష్ నగర్, కండ్రిక, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో బాధితులకు వాటిని అందించనున్నట్లు తెలిపారు. వరద బాధితులకు సహాయం చేయాలనుకున్న వారు బౌద్ధ ధమ్మ పీఠం, ఉండ్రాజవరం సెల్ 9392980666ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిన శ్రీనివాసరావు, బూరుగుపల్లి కళారావు, గంటా వెంకట్రావు, నందిన రమేష్, కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు..

విజయవాడ బయలుదేరిన ఆహార పదార్థాల వ్యాను

నేడు విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యాయ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించామని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.

కౌన్సిల్ ఆమోదం లేకుండా టెండర్ ప్రక్రియ తగదు

ప్రజాశక్తి – నిడదవోలు

నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం లేకుండా టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి ఆ తర్వాత కౌన్సిల్‌కి అంశాన్ని ఎజెండాగా తీసుకురావడం రాజ్యాంగం విరుద్ధమని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ ఆమోదంలేకుండా జరుగుతున్న విషయాలపై అధికార పక్ష సభ్యులే అధికారుల తీరును నిలదీశారన్నారు. ఈ సమావేశంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్టు ఎఇ తెలిపారన్నారు ఏ ప్రజాప్రతినిధి లేదా ఏ అధికారులకు ఆదేశించారో సమాధానం చెప్పాలని రాంబాబు డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్దంగా స్థానిక సంస్థల చట్టం ప్రకారం సుపరిపాలన కోసం చట్టబద్దంగా ప్రజలనుంచి ఎన్నికైన కౌన్సిలర్స్ దృష్టికి తీసుకురాకుండా ఇలా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. డ్రెయినేజీల పూడిక తీయకుండానే బిల్లులు చేసేసుకుంటున్నారని కౌన్సిల్ సభ్యులే ఆరోపించిన దృష్ట్యా, దీనిపై సమగ్ర విచారణ చేయాలన్నారు. ఆరోపణలు నిజమైతే కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మూడేళ్ల కాలంలో ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు ఎంత, ఏఏ ప్రాంతాలకు ఖర్చుచేశారో శ్వేతపత్రం ఇవ్వాలన్నారు.

పిఠాపురం బయలు దేరిన మొక్కల లారీ

పిఠాపురానికి 12 వేల మొక్కల సరఫరా

ప్రజాశక్తి– కడియం

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. మండలంలోని బుర్రిలంక గ్రామానికి చెందిన ప్రముఖ నర్సరీ రైతు, జనసేన పార్టీ జిల్లా నాయకులు గెడ్డం శివరత్నగణపతి 12 వేల మొక్కలను పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా నాటేందుకు ఆదివారం లారీలో పంపించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఏ రకమైన మొక్కలు నాటాలని పిలుపునిచ్చారో అవే రకాల మొక్కలను స్థానిక రైతుల సహకారంతో పంపించామన్నారు. 24 ఏళ్లుగా చిరు సేవా సమితి పేరిట ప్రతి ఏటా చిరంజీవి, పవన్ కళ్యాణ్ పుట్టినరోజులకు రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వేలాదిమందికి అందిస్తున్నారు. కాగా సోమవారం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బుర్రిలంకలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు శివ స్థానిక విలేకరులకు తెలిపారు.

గంటావారి గూడెంలో డ్రగ్స్ కలకలం

ప్రజాశక్తి–నల్లజర్ల

నల్లజర్ల మండలం గంటావారిగూడెంలో మాదకద్రవ్యాలను(డ్రగ్స్) తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఎస్పి పి.నరసింహకిషోర్ తెలిపిన వివరాల మేరకు... తెలంగాణ నార్కోటిక్ కంట్రోల్, బ్యూరో అధికారులకు అందిన సమాచారం మేరకు ఆగస్టు 31 రాత్రి 11 గంటలకు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఆల్‌ప్రోజోలం అనే మందుకు సంబంధించిన ముడి పదార్థాలు. స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంట వారి గూడెం గ్రామానికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తికి సంబంధించిన వేరుశెనగ గుళ్ల ఫ్యాక్టరీని నష్టాల కారణంగా ఉత్పత్తిని నిలిపేశారన్నారు. ఫ్యాక్టరీ వెనుక సీక్రెట్ చాంబర్‌లో నిర్మించి ఇక్కడ మత్తు పదార్థాల తయారీకి సిద్ధమయ్యారన్నారు. దీనికి కావాల్సిన యంత్రాలు, ముడి సరుకును సమకూర్చుకున్నారని తెలిపారు. సమాచారం అందిన వెంటనే రైడ్ చేసి పట్టుకున్నామన్నారు. మరింత లోతుగా విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో రెండు ఆయిల్ బాడ్స్, మిషన్లు, వ్యాక్యూమ్ పంపు, ఓవెన్, ఉన్నాయని తెలిపారు. దీని ప్రాసెస్ తెలిసిన టెక్నీషియన్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు ఇది ప్రస్తుతం నూతన యంత్ర పరికరం అన్నారు. ప్రభుత్వం 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా డ్రగ్స్ పైన గంజాయి పైన జాయింట్ ఆపరేషన్ చేయడం జరిగిందని ఇలాంటి వారందరి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, సహకరించినా చరయలు తప్పవన్నారు. అరెస్టయిన వారిలో బాలకృష్ణ, మకాం వెంకటేశు, జగదీష్, హైదరాబాదుకు చెందిన శ్రీనివాసు ఉన్నారన్నారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. నిందితులను పట్టుకునేందుకు సహకరించిన నల్లజర్ల సిఐ ఎన్.శ్రీనివాసు, ఎస్ఐ శ్రీహరిబాబు, కానిస్టేబుల్స్ జి.రవికుమార్, పి.తాకేశ్వరరావు, కె.సంతోష్‌కుమార్‌ను ఎస్‌పి అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి నరసింహకిషోర్

ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

వైద్యం కోసం 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి – తాళ్లపూడి

పుట్టుకతోనే హార్మోన్ల సమస్యతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేకపోతున్న మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన యండపల్లి చంద్రశేఖర శ్రీనివాసు అనే చిన్నారికి మండల మానవతా శాఖ ఆదివారం రూ.6వేల సాయం అందించింది. ఈ కార్యక్రమంలో మానవతా మండల శాఖ అధ్యక్షులు ఆంకెం సురేష్, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, అప్పల వీర హనుమంతు, సనపల రాజశేఖర్, జి.సాయిబాబా, కె.వెంకటేశ్వరరావు, జి.మునేశ్వరరావు, టిఎన్‌బి.గుప్త, వై.సూర్యనారాయణ, అనిల్, వై.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి– కడియం

సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మండలం లోగల కడియం, కడియపులంక పిహెచ్‌సి పరిధిలో ఆదివారం జేగురుపాడు, పొట్టిలంక, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నందున వారికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ శిబిరంలో జేగురుపాడు లో 51 మంది రోగులను పరీక్షించగా వారిలో జ్వరంతో ఉన్న 12 మందిని గుర్తించారు. ఐదుగురికి డెంగీ పరీక్షలు, ఏడుగురికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. పొట్టిలంకలో 46 మంది రోగులను పరీక్షించారు. జ్వరంతో ఉన్న ఆరుగురిని గుర్తించారు. ఇద్దరికి డెంగీ టెస్టులు, ముగ్గురికి మలేరియా టెస్టులు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎన్.నాగసాయి మౌర్య, డాక్టర్ జి.స్వరూప, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు :

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ తనూజ అన్నారు. మండల కేంద్రం చాగల్లు సచివాలయం -3 పరిధిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్, సూపర్‌వైజర్లు పిహెచ్‌ఎన్.జమీలా, హెచ్‌వి.ప్రభావతి, ఎఎన్‌ఎంలు సీతా మహాలక్ష్మి, భారతి, ఎంఎల్‌హెచ్‌పి ఊహ, ఆశా కార్యకర్తలు సుబ్బలక్ష్మి, రమాదేవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి– కడియం

రౌడీ షీటర్లు తమ విధానాలను మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండపేట రూరల్ పోలీస్ స్టేషన్లో వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ దొరరాజు మాట్లాడుతూ ఇప్పటికైన ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. ఆవేశంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ వాటిని సరిదిద్దుకుని వివేకంతో మెలగాలన్నారు. మరొకసారి ఇటువంటి తప్పులు చేయకుండా సన్మార్గంలో ముందుకు వెళ్లాలన్నారు. చట్ట విరుద్ధమైన పనులకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక – మీకోసం' కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఇతర జిల్లాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో ఆయా ప్రధాన కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

రామకృష్ణకు పుట్టిన రోజు కేక్‌ను తినిపిస్తున్న అభిమానులు

ఘనంగా రామకృష్ణ పుట్టినరోజు

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

టిడిపి మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ పుట్టిన రోజు వేడుకలు ఉండ్రాజవరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. మండల స్థాయి నుంచి ఉన్నత పదవులు అధిరోహించాలని రామకృష్ణను పలువురు అభినందించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుట్టినరోజు కేక్ కట్ చేసి పంచారు. అనంతరం సేవా కార్యక్రమంలో భాగంగా అభిమానుల ఆధ్వర్యంలో గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు.

ఎంఎల్‌సి ఓటరు నమోదుకు 3 వరకు గడువు

ప్రజాశక్తి – చాగల్లు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్ నమోదుకు ఈనెల మూడో తేదీ వరకు గడువు ఉందని తహశీల్దార్ ఎం.మేరకమ్మ తెలిపారు. గడిచిన ఆరేళ్ల కాలంలో మూడేళ్ల సెకండరీ పై స్థాయిలో విద్యాలయలో ఉపాధ్యాయులుగా పని చేసిన వారు అర్హులు అన్నారు. ఫారం 19లో పూర్తి వివరాలు నమోదు చేసి దరఖాస్తును తహశీల్దార్, లేదా ఎంపిడిఒకు అందించాలన్నారు.

స్ఫూర్తి ట్రస్ట్ కార్యాలయంలో పుట్టినరోజు వేడుక

రాజమహేంద్రవరం రూరల్ : ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల కుమారుడు ముత్యాల పవన్‌సాయిశ్రీగణేష్ పుట్టిన రోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోసి కుమార్ సత్య దంపతులు కేక్ పవన్‌సాయితో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా పోసికుమార్ మాట్లాడుతూ తమ కుమారుడు పుట్టినరోజును ట్రస్ట్ సభ్యులు, వృద్ధులు, వికలాంగుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

కార్టూ'నిజం'



పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి –దేవరపల్లి

మండలంలో పారిశుధ్యం పనులపై అధికారులు, సిబ్బంది దృష్టి పెట్టాలని మండల అధ్యక్షులు కెవికె.దుర్గారావు, ఎంపిడిఒ పి.ప్రభాకర్‌రవు, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. దుర్గారావు అధ్యక్షతన ఆదివారం వైద్య సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ భారీ వర్షాలు వల్ల పారిశుధ్యంలో లోపిస్తుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి ట్యాంకుల వద్ద కాచి చాలర్చిన నీరు తాగాలి అనే బేనర్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

పూడిక పనుల పరిశీలన

ప్రజాశక్తి –దేవరపల్లి

దేవరపల్లి మండలం త్యాజంపూడి, కురుకూరు మధ్యలో ఉన్న బర్లవాగుకు పడిన గండ్లు పూడిక పనులన కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం తనిఖీ చేశారు. ఆమె వెంట కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహశీల్దార్ రాజ్యలక్ష్మి ఉన్నారు. పనుల నాణ్యతపై ఆరా తీశారు.

వసతిగృహాల సందర్శన

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వ బిసి వసతిగృహాలను బిసి సంక్షేమ అధికారి శశాంక ఆదివారం సందర్శించారు. వసతి గృహాల్లో పారిశుధ్యం నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాతావారణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేడి నీటి ఆవశ్యకతను, ఆహార సరఫరా తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కాచి చల్లార్చిననీటితే తాగాలని తెలిపారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలని, తగిన చికిత్స తీసుకోవాలన్నారు.

తపస్విరెడ్డికి కరాటేలో పతకాలు

ప్రజాశక్తి – నిడదవోలు

నిడదవోలుకు చెందిన కుంచాల తపస్విరెడ్డికి ఆంధ్రప్రదేశ్ గోజో రియో కరాటే డు అసోసియేషన్ నిర్వహించిన 8వ స్టేట్ గోజు రియో కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ -2024 అండర్1-4 బ్లాక్ బెల్ట్ విభాగంలో మూడు బంగారు పతకాలు వచ్చాయి. పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెం సాయి సేవా సమాజ్ కళ్యాణ మండపంలో ఈ పోటీలు జరిగాయి.

చివటం, సత్యవాడల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

ఫీవర్ సర్వేలో భాగంగా ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చివటం, వేలివెన్ను పరిధిలోని సత్యవాడల్లో ఆదివారం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడారు. వాతావరణ మార్పులతో వస్తున్న సీజనల్ వ్యాధులు, దోమల వల్ల వాపించే వ్యాధులు, రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చివటంలో ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ షేక్ ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ కెకె.సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పిలు కె.విజయ, బ్యులా జోయ్, ఎఎన్‌ఎంలు డి.సూర్యకుమారి, మల్లీశ్వరి, హెల్త్ అసిస్టెంట్ డి.సుబ్రహ్మణ్యం, ఆశాలు సుజాత, విజయలక్ష్మి, సంధ్యారాణి పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు, మరో వ్యక్తి గాయలపాలయ్యాడు. స్థానిక ఎస్ఐ టి.రఘునాథరావు తెలిపిన ప్రకారం...అనపర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోనాల సాయి మణికంఠ రెడ్డి(25), నల్లమిల్లి శివదుర్గారెడ్డి ఇరువురు బైక్‌పై విశాఖపట్నం వైపు వెళుతుండగా రామవరం పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న బొల్లోరా వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇరువురు పక్కనున్న కాలువలోకి పడిపోయారు. దీంతో సాయి మణికంఠ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా శివదుర్గారెడ్డి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే శివ దుర్గా రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. వాహన డ్రైవర్ పరారీలో ఉండగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని అమనాబాద్ గ్రామానికి చెందిన యువకుడు చెరువులో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..గ్రామానికి చెందిన కాకడ లోవరాజు (30) చెరువులో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లి కాలు జారి చెరువులో పడినట్లు తెలుస్తోంది. మృతిడికి భార్య, నాలుగేళ్ల పాప ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని కోలంక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కోలంక గ్రామానికి చెందిన యాళ్ళ శ్రీనివాస్ మద్యానికి బానిసై తండ్రితో గొడవకు దిగేవాడు. కొడుకు ఆగడాలను తట్టుకోలేక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మనస్థాపానికి గురియైన శ్రీనివాస్ శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తులసిరామ్ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని స్టీల్ వేల్ పేటకు చెందిన యువతి తుమ్మలపల్లి మౌనిక(19)) కనిపించడం లేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల ఆగస్టు 31 నుంచి తమ కుమార్తె కనిపించడం లేదని, తాళ్లపొలం గ్రామానికి చెందిన కిషోర్ అనే యువకుని ప్రమేయం ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

కుమారుని అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తన కుమారుడు కన్పించడం లేదంటూ ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని ఠానేలంక గ్రామానికి చెందిన బొంతు మోహన్ శివసందీప్‌కు అతని భార్య త్రివేణిల మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 29న మోహన్ శివ సందీప్ ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు స్నేహితుల ఇళ్ళ వద్ద వెతికిన ఆచూకీ లభించక పోవడంతో శివసందీప్ తల్లి చంద్రావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవగాహన ఉంటే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) భాస్కరరావు అన్నారు. వర్షాకాలం సీజన్లో ప్రధానంగా మలేరియా, డెంగీ వ్యాధులతోపాటు విషజర్వాలు ప్రభలే అవకాశం ఉన్నందున దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గతేడాది ప్రతి ఇంటిలోనూ ఒకరికి వ్యాధులు సోకి ఆస్పత్రులలో చికిత్స పొందారు. ఈ ఏడాది కూడా వ్యాధుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలోని, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ కాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది. పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. పూలకుండీలు, వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టు పక్కల పాత టైర్లు, తాగి పాడేసిన కొబ్బరి బోండాలు ఉండకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం మంచింది.

డయేరియా రావడానికి కారణాలేంటి.. రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి.?

కలుషిత నీటిని తాగడం, ఆహారాన్ని తినడంవల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. వర్షాలకు ఇంటి పరిసరాలు చిత్తడిగా మారి ఈగలు పెరుగుతాయి. ఈగలు మనం తినే ఆహార పదార్థాలపై వాలి కలుషితం చేస్తాయి. దీంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకకుండా పరిసరాల శుభ్రతను పాటించాలి. ఇంట్లోకి ఈగలు రాకుండా జాలీ (మెష్) వంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు, ద్రవపదార్థాలు పడేయకూడదు. వేడి పదార్థాలను తీసుకోవడం మంచింది.

డెంగూ లక్షణాలు ఏమిటి..ఎలా వ్యాపిస్తుంది.గణాంకాలు తెలపండి.?

డెంగూను వ్యాపించే దోమ శుభ్రమైన నీటిలో పెరుగుతుంది. ఈ దోమ కుట్టిన పది రోజులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే డెంగూగా పరిగణించాలి. వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు (ప్లేట్లెట్స్) తగ్గి పరిస్థితి విషమించే ముప్పు ఉంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే



డెంగూ సోకుండా చూసుకోవచ్చు. ఇంటి ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసరాల్లో నీరు నిలిస్తే కిరోసిన్ చల్లాలి. జిల్లాలో 2016లో 336 కేసులు, 2017లో 170 కేసులు, 2018లో 545కేసులు, 2019లో అత్యధికంగా 575 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 24 వరకూ 3,145 మందికి పరీక్షలు చేయగా 116 కేసులు నమోదయ్యాయి. అప్రమత్తంగా లేకుంటే కేసుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

మలేరియా రాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.. గణాంకాలు ఏమిటి.?

దోమల నివారణకు నిలువ ఉన్న నీటిలో లార్వా నివారణకు గంబుసియా చేపలను వదులుతున్నాం. ఈ చేపలు దోమల లార్వాను తినడం వలన వ్యాప్తి తగ్గుతుంది. సుమారు 2 లక్షల చేపలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలల్లోనూ వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో మలేరియా కేసులు 2016లో 9061, 2017లో 5995 కేసులు, 2018లో 1865 కేసులు, 2019లో 646 మలేరియా కేసులు, ఈఏడాది జనవరి నుంచి ఆగస్టు 24 వరకు 5,549 మందికి పరీక్షలు చేయగా 5 కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీ మండలాల్లోని ఇవి ఎక్కువగా నమోదవుతున్నాయి.

వైరస్‌ల ప్రభావంతో వచ్చే జర్వాలు వాటి ప్రభావం ?

వర్షాలు కురుస్తున్నందున వైరస్ ప్రభావం ఎక్కువ ఉంటుంది. దగ్గు, జలుబుతో మొదలై జ్వరం వస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఎక్కువై ప్రమాదం భారిన పడే అవకాశం ఉంది. వృద్ధుల్లో శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఆయాసం పెరుగుతుంది. చిన్నపిల్లల్లో జ్వరం ఎక్కువగా వస్తే మూర్ఛపోయే అవకాశాలు ఉంటాయి. నిల్వ ఉన్న పదార్థలు తినకూడదు. ఇంటి ఆవరణంలో నీల్వకుండా జాగ్రత్తలు పాటించడం వల్ల వైరస్‌లు వ్యాపించవు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కూడా శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిని తాగాలి.

సీజన్ వ్యాధుల నివారణ కోసం చేపడుతున్న చర్యలేమిటి.?

గ్రామీణ ప్రాంతాల్లో ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతోపాటు కళా జాతాలు, పిహెచ్‌సి, సిహెచ్‌సిల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామీణ, పట్టణ.ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేయడం జరుగుతోంది. వైద్య సిబ్బందిని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటలక్ష్మి

సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ పట్ల వసతి గృహ అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ సి హెచ్.వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె పట్టణ పరిధిలోని ఎస్‌సి బాలురు, బాలికలు, బిసి బాలురు, బాలికల వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను, వర్షాల ప్రభావం వల్ల సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని అందించాలన్నారు. వసతి గృహాలలో కల్పిస్తున్న సదుపాయాలు, భోజనాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కాంతారావు, ఆయా వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెద్దాపురం

భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలో వర్షాలు వల్ల సంభవించే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. పట్టణ పరిధిలో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 08852-242100 కు సమాచారం అందించాలన్నారు. దీనికి సంబంధించి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

మొక్కను నాటుతున్న పర్వత సురేష్

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - శంఖవరం

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అవసరమైన పర్యావరణం పరిరక్షించుకోవచ్చని ప్రత్తిపాడు నియోజవర్గ టిడిపి సీనియర్ నాయకుడు పర్వత సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు దృష్టి సారించాలన్నారు. మొక్కలు చుట్టూ రక్షణగా ట్రీ గార్డ్సును మండల జనసేన నాయకుడు మేకల కృష్ణ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నశంకర్లపూడిలో అరుదైన పక్షి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గాయాలతో రైతుకు లభించిన అరుదైన పక్షి

ప్రత్తిపాడు మండలం చిన్న శంకర్ల పూడి గ్రామంలో అరుదైన పక్షి ప్రత్యక్షమైంది. బెంగాల్ అడవుల్లో మాత్రమే కనిపించే బెంగాల్ ఈగల్ ఓవెల్ అనే పక్షి చిన్న శంకర్ల పూడి గ్రామానికి చెందిన రైతు చను బోయిన బుజ్జి పొలంలో గాయాలతో పడివుంది. కోతిని పట్టుకు పోతుండగా మిగతా కోతులు దాడి చేయడంతో గాయపడింది. గాయాలతో ఉన్న పక్షిని రైతు ఈ పక్షిని ఇంటికి తీసుకువచ్చి కోళ్లను పెంచే గూడులో ఉంచి అటవి అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ పక్షి మేకలను, కొండ గొర్రెలను అమాంతం కాళ్లతో పట్టుకుపోయి ఆహారంగా తీసుకుంటుందని, దీనిని ఇండియన్ ఈగల్ ఓవెల్ అంటారని, ఈ పక్షి కేవలం బెంగాల్ అడవుల్లో మాత్రమే ఉంటుందని అధికారులు తెలిపారు. పక్షికి వైద్య చికిత్సలు అందించి అడవులోకి తీసుకెళ్లి వదిలేస్తామని అధికారులు తెలిపారు.

వర్షాలకు కూలిన పాత భవనం

ప్రజాశక్తి - పిఠాపురం

కూలిపోయిన పాత భవనం శిధిలాలు

గత రెండు మూడు రోజులుగా కురుసున్న వర్షాలకు స్థానిక గోల్డ్ మార్కెట్ సెంటర్ లోని పాత భవనం కొంతమేర కూలిపోయింది. భవనం కూలిపోయే సమయానికి జన సంచారం పెద్దగా లేకపోవడం, చుట్టూ ప్రక్కల దుకాణాలు తెరవకపోవడతో ప్రమాదం తప్పింది. మున్సిపాలిటి పరిధిలో కాలం చెల్లిన భవనాలు పదులు సంఖ్యలో ఉన్నాయి. కాలం చెల్లిన భవనాలపై చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలం చెల్లిన భవనాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పిఠాపురం

రోగులతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ వర్మ

స్థానిక ఎల్ఐసి కార్యాలయ రోడ్డులోని ఉన్న శ్రీ సాయి భవాని హాస్పిటల్ ఆధ్వ ర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ ఎన్.వర్మ ప్రారంభించారు. వైద్యులు బి వెంకటేష్, టిఎస్ఎస్.దక్షిణమూర్తి సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వివిఎస్.రామారావు, సూపర్‌వైజర్ ఎస్‌కె.రెహమాన్, ఫిజియోథెరపిస్ట్ కె.తరుణ్‌కుమార్, ఆడియాలజిస్ట్ కె.రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి సత్యచరిష్య వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి - సామర్లకోట

చిన్నారి సత్య చరిష్య

వారణాశిలో ఆదివారం నిర్వహించిన రావణాకృత శివతాండవం కూచిపూడి నృత్య కార్యక్రమంలో పట్టణానికి చెందిన కోడూరి సత్య చరిష్య వరల్డ్ రికార్డు హోల్డర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని సత్య చరిష్యకు తల్లి తండ్రులు కోడూరి సత్య శివ ప్రసాద్, రాణి లకు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ అభినందనలు తెలిపారు.

నేడు దివిలిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నేడు మండలంలోనిదివిలి ఎంపీ యూపీ పాఠశాల వాటర్ ట్యాంక్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎం.సత్యప్రసాద్, జిఎస్‌వి.రావు, కెఎస్‌ఆర్‌కె,చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ రక్తదాన శిబిరంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పాల్గొంటారని తెలిపారు.

మట్టి విగ్రహాలతోనే చవితి వేడుకలు

ప్రజాశక్తి - కాకినాడ

మట్టి వినాయక విగ్రహాలు ఉపయో గించి పర్యావరణహితంగా వినాయక చవితని నిర్వహించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీని వాస్ వినీల్ పిలుపునిచ్చారు. ఆదివారం మట్టి గణపతి ప్రతిమలు తయారు చేసే పోటీని ఎంఎస్ ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరిచారు. 18 పాఠశాలలు, కళాశాలల నుంచి 46 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలు ఉపయో గించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. హెచ్ఎం ఎంఎస్.సుబ్రమణ్యం మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ జి.సాయినంద కుమర్, ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విఎస్‌వి.రమణమూర్తి, సిహెచ్‌ఆర్ విజి.ప్రసాద్, జి.శ్రీనివాస్, శ్రీహరిరావునాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంఎల్ఎ హరికృష్ణ జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం మాజీ ఎంఎల్‌ఎ రక్షా హరికృష్ణ 84వ జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రిరోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య, ఎస్‌పి రాజశేఖరన్, సీఐ షణ్ముఖం, ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు. అలాగే ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్ స్థానిక మెట్టకూరు ఫిషర్‌మెన్ పేటలో రక్షా హరికృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లాడి అభిమానులు పాల్గొన్నారు.

దార్శనికుడు సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

దార్శనికుడు, విజనరీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి శుభ సూచకం అని నియోజకవర్గ పార్టీ నేతలు కొనియాడారు. మండలంలోని సిహెచ్ గున్నేపల్లిలోని సీనియర్ నాయకుడు గొలకోటి దొరబాబు ఇంటి వద్ద చంద్రబాబు ముఖ్యమంత్రిగా 30 ఏళ్ల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన రోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 1995 సెప్టెంబర్ 1 న తొలిసారి ముఖ్యమంత్రి గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి బాధ్యతలు చేపట్టి నేటికి 29 ఏళ్లు పూర్తి చేసుకుని 30వ యేట అడుగిడిన సందర్భంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దార్శనికుడు ముందుచూపు గల వ్యక్తి విజినరీ లీడర్ చంద్రబాబు అని పలువురు కొనియాడారు.

3న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల ంలోని ఈ నెల 3న అంగర అసిరాంబ అమ్మవారి ఆలయం వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరానికి ప్రొగ్రాం ఇంచార్జ్ ఎస్.కరుణకుమార్ ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.ప్రవీణ్ కుమార్ తదితరులు నిర్వాహకులు తెలిపారు.

పవన్‌కు గణిత చదరంతో శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

2	9	20	24
25	19	6	5
7	4	26	18
21	23	3	8

డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మ్యాజిక్ చదరాల ద్వారా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ గణిత అవధాని తోటకూర సాయి రామకృష్ణ రూపొందించారు. ఈ చదరంలో మొదటి వరుసలో పుట్టిన రోజు తీసుకోబడింది. నాలుగు చదరాల్లో సంఖ్యల మొత్తం 55 వచ్చింది. దీన్ని మ్యాజిక్ సమ్ అంటారన్నారు. ఇపుడు చదరం ప్రత్యేకత ఏమిటంటే.వాడిన అంకె మరల వాడకుండా, ఏటు కూడిన 55 రావడం విశేషం. నాలుగు అడ్డు వరుసల్లో సంఖ్యల మొత్తం 55. నాలుగు నిలువు వరుసల్లో సంఖ్యల మొత్తం 55 రెండు కర్ణాలలో సంఖ్యల మొత్తం 55. నాలుగు మూలల సంఖ్యల మొత్తం 55. వరుసగా ఉన్న చిన్ని చదరాల్లో నాలుగు సంఖ్యల మొత్తం 55. ఇలా అనేక రకాలుగా 25కి పైగా ఒకే మొత్తం 55 వచ్చేలా రూపొందించారు. ఈ మ్యాజిక్ గణిత చదరం ద్వారా శుభాకాంక్షలు అందచేసి సాయి రామకృష్ణ ప్రత్యేకత చాటుకున్నారు.

In the Court of the Principal Junior Civil Judge, Kakinada
O.S. No. 1/2021
Between:
Canara Bank (Erstwhile Syndicate Bank), Madhura Nagar Branch, Kakinada. ...Plaintiff
AND
1. Smt. Lanka Sri Latha
2. V.Nageswara Rao ...Defendants
To:
1. Smt. Lanka Sri Latha, W/o. L.Venkateswara Rao, Proprietor of M/s. Sree Agnecies, aged 39 years, Business, D.No. 68-4-4, Kulai Veedhi, Opposite to Veer Kamal Theatre, Kakinada
2. V.Nageswara Rao, S/o. V.Venkata Ramana, aged 58 years, Business, D.No. 8-5-11, Venkata Narayana Street, Gandhi Nagar, Kakinada
పై నెంబరు దావాలో 1 మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-09-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
P.RAMAKANTH, Advocate
Kakinada, Cell: 9849215992

ముంపు సమస్యతో అవస్థలు

- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న వర్షం, మురుగునీరు
- రాజోలు వాసులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు నియోజకవర్గ ముఖ్య కేంద్ర వాసులకు ముంపు సమస్య తప్పడం లేదు. . ప్రధాన రహదారితోపాటు పలు కాలనీల్లో మురుగు నిలిచిపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్నేళ్ల కిందట నియోజకవర్గ కేంద్రంలో భూగర్భకాలువల నిర్మాణానికి గాను ఇంజినీంగ్ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. భూగర్భ డ్రెయిన్ వ్యవస్థ వల్ల ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు, వర్షం, మురుగు నీటిని కూడా పంపించేందుకు అప్పట్లో ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీనిపై గత సర్కారు కూడా దృష్టి సారించలేదు. మరోవైపు రాజోలులో కాలువలపై ఆక్రమణలు

వర్షం నీటికి ముంపులో రాజోలు బ్యాంక్ స్ట్రీట్

వర్షం నీరు దిగక చెరువులా రాజోలు ప్రధాన రహదారి

పెరిగిపోగా, తూతూ మంత్రంగా పూడికతీత పనులు చేపట్టడంతో ఏటా వర్షాకాలం రాజోలు వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొద్దిపాటి వర్షానికి సైతం రాజోలు గాంధీ సెంటర్ నుండి సాయిబాబా గుడి వరకు మెకాళ్లలోతు వరకు వర్షం నీరు నిలుస్తోంది. మురుగునీరు కూడా ప్రధాన రహదారిపైకి చేరడంతో నివాసితులు, వ్యాపారులు బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిలోనూ ఎక్కడికక్కడే వర్షపు, మురుగునీరు నిలిచిపోవడంతో వాహనదారులు , పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఏటా వర్షాకాలంలో ఎదుర్కొంటున్న ఈ సమస్య నుంచి గట్టెక్కించాలని , ముంపు బాధను తప్పించాలని ప్రజలు నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కూడా స్పందించి భూగర్భ కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భారీ వర్షంతో రహదారుల జలమయం

ప్రజాశక్తి - రౌతులపూడి

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సాగునీటి చెరువులు నిండుకున్నాయి. పలు గ్రామాల్లో డ్రెయినేజీలు, రోడ్లు తేడా లేకుండా పొంగిపొర్లాయి. డ్రెయినేజీలలో చెత్తా చెదారం ఒక చోటకు చేరి అపారిశుధ్యం తాండవిస్తుంది.

బాల మందిరంలో బాలల సభ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవ పట్నం జమున నగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ బాల మందిరం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బాలలసభ జరిగింది. కథలు చదవడం, కథల సమీక్షలు, కథలు చెప్పడం కార్యక్రమాలు నిర్వహించారు. క్యారమ్స్, చెస్, వైకుంఠ పాళీ వంటి ఇన్ డోర్ గేమ్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పద్యాలు, పాటలు పాడారు. స్వీయరచనలో పిల్లలు ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి బాల మందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు.

పోలీస్ పహరా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పిల్లంక, గోవలంక ఏటిగట్టుపై రాత్రి సమయాల్లో పోలీసు పహరా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన పలువురు మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. శనివారం రాత్రి కొందరు యానం ప్రాంతానికి చెందిన గంజాయి బ్యాచ్ యువకులు గ్రామానికి చెందిన వ్యక్తులపైన, ప్రయాణికులపైన దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇదే రహదారిపై పాఠశాలలు, కళాశాల నుంచి బాలికలు వస్తూ ఉంటారని, గంజాయి బ్యాచ్ వల్ల పలువురు తల్లిదండ్రులు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాత్రి సమయాల్లో ఏటిగట్టుపై గంజాయి, మద్యం సేవిస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఏటిగట్టుపై పోలీసుల పహారా ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు వేలూరి కాశిబాబు, జిత్తుగ శ్రీనివాస్ కోరారు.

శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ఇంజనీరింగ్ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆదిత్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎంబి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హైదరాబాదుకు చెందిన ఆర్‌టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల మెగా బూట్ క్యాంపులో ఆయన మాట్లాడారు. పాఠ్యాంశాల్లోనూ, శిక్షణలోను నేర్చుకున్న అంశాలు ఉన్నత ఉద్యోగ సాధనకు ఉపయోగపడాలని ఆయన అన్నారు. భవిష్యత్‌లో వృత్తి నైపుణ్యాన్ని పెంపుదల చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖాధిపతులు డాక్టర్ ఆర్‌వివి.కృష్ణ, ప్రొఫెసర్. సిహెచ్.జానకిదేవి, ఆర్‌టెక్ ప్రోగ్రాం మేనేజర్ ఎం.చరణ్‌దత్, ఆదిత్య విద్యాసంస్థల ఆర్టెక్ కోఆర్డినేటర్లు ఎస్.దుర్గాప్రసాద్, పి.భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ కుడుపూడికి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం



కుడిపూడివిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్

మాజీ ఎంఎల్ఎ, వైసిపి నాయకుడు దివంగత నేత కుడుపూడి చిట్టిబ్బాయి జయంతిని పార్టీ ఉశ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆదివారం అమలాపురం గడియస్తంభం సెంటర్ లో ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు సంసాని బుల్లి నాని, చిట్టిబ్బాయి తనయుడు కుడుపూడి భరత భూషణ్, జెడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరి, గన్నవరపు శ్రీనివాసరావు,కుడిపూడి సత్య శైలజ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE :: PITHAPURAM
1.A.373/2023 O.S.159/2023
Between
Sundara Satyanandam .. Petitioner/Plaintiff
AND
Nimmala Babji .. Respondent/Defendant
టు ప్రతివాది:
నిమ్మల బాబీ, S/o.మంగరాజు, వయస్సు 46 సం.రం.లు, డోర్.నెం. 1-68, 1-71, కోలంక, పిఠాపురం మండలం
పై దావా మరియు పిటిషన్ లో వాది మీ మీద దాఖలు చేసుకున్న దావా మరియు పిటిషన్ లో మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయు చున్నందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబర్ గల దావా మరియు పిటిషన్ **ది.03.09.2024న** వాయిదా అయివున్నది.
కావున ఆ రోజు **ఉదయం 10:30 గం. నిలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారాగాని హాజరు అయ్యి పై పిటిషన్ మరియు దావాలో మీ ఆక్షేపణలు తెలియ జేయవలెను. లేనియెడల పై దావా మరియు పిటిషన్ మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయబడినది.
(యిది శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారం జారీ చేయబడిన నోటీసు)
సాకా నాగేశ్వరరావు
న్యాయవాది, పిఠాపురం
ఫోన్: 9866094454